## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**తెనాలిరూరల్:** విద్యుత్‌లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా తెనాలి పట్టణంలోని సుందరయ్యనగర్, సుల్తానాబాద్, ఆలపాటి నగర్‌లో శనివారం ఉదయం తొమ్మిది నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం. లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

**తెనాలిఅర్బన్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్ఏఎంపీ పథక అమలులో భాగంగా తెనాలి పట్టణంలో ఎం.ఎస్.ఎం.ఈల సర్వేను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలోని వాణిజ్య, సేవా, తయారీ రంగాల్లోని వ్యాపారుల వివరాలను సర్వే కోసం ప్రత్యేకగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తెనాలి పట్టణాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని సర్వే చేయడం జరుగుతుందన్నారు. సోమవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైందని, పట్టణంలోని అన్ని రకాల వ్యాపారుల వద్దకు సచివాలయ ఉద్యోగులు వచ్చి సర్వే చేస్తారని తెలిపారు. ఉద్యోగులు అడిగే అన్ని వివరాలను అందజేయాలని కోరారు.

### రేపు గుంటూరులో ఒకరోజు వ్యక్తిత్వ వికాస శిక్షణ

**తెనాలి:** గుంటూరుకు చెందిన స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (స్టెప్), కొరిటపాడు పార్కు యోగ టీం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన గుంటూరు, చైతన్యపురి సెకండ్‌లైన్‌లోని విజ్ఞానంద బాలకుటీర్‌లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన శిక్షణ తరగతుల్లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, 'స్టెప్' రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు వివిధ అంశాలను బోధిస్తారు. ఒత్తిడిని అధిగమించటం, ఈగో విధానం, ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్, ప్రజలతో మెలగటం, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, బిహేవియర్ మేనేజ్‌మెంట్ అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్న భోజనం కూడా ఉంటుందనీ, ఆసక్తి గలవారు సీనియర్ యోగ ట్రైనర్ ఎస్.సభాపతి (7995953388), ధర్మారెడ్డి (8143234555), ప్రత్యూష సుబ్బారావు (9030644440) నంబర్లకు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

### సద్వినియోగం చేసుకోండి

**కొల్లిపర:** సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమాచార బోర్డును ఏర్పాటు చేసి ప్రజలు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

### పశువుల వివరాలు తెలియజేయండి

**కొల్లిపర:** మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేస్తుందని, పాడి రైతులు తమ పశువుల పూర్తి వివరాలు తెలియజేయాలని మండల పశువైద్యాధికారి డాక్టరు సాయిసతీష్ రాజు శుక్రవారం తెలిపారు. 20 గ్రామాల్లోని పాడి రైతులు వారి వద్ద ఉన్న ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు గురించి సర్వేకు వచ్చిన అధికారులకు తెలియజేయాలని సూచించారు. పాడి రైతులు అధికారులకు సహకరించి వాటి వివరాలు ఇవ్వటం వలన ప్రభుత్వం పశువులు ఏమాత్రం ఉన్నాయి వాటికి వైద్యశాలకు ఏమేరకు మందులు పంపించాలని, పాడి పశువులపై సబ్సిడీ పథకాలు మంజూరు చేసే అవకాశముందని చెప్పారు.

### 29న జాబ్ మేళా

**వేమూరు:** ఈ నెల 29వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ప్రణయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు రావచ్చని, వయస్సు 18–31 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు.

### రక్తహీనత నివారణకు కృషి

**ఫిరంగిపురం:** రక్తహీనత నివారణకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 135 మందికి బీపీ, షుగరు, థైరాయిడ్, రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలలో రక్త హీనత నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఎటువంటి ఆహారం తీసుకోవడం ద్వారా రక్తశాతం పెరుగుతుందనే దానిపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తమ ఆహారంలో తృణ ధాన్యాలతో పాటు, పాలు, ఆకుకూరలు,గుడ్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్ హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆర్. ఆంథోని రాణి, మేల్ అసిస్టెంట్ బాబురావు, పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.


# నిఘా నేత్రం నిద్రపోతోంది!

- పీసీఆర్‌కు అనుసంధానించిన కెమెరాలు పనిచేయని వైనం
- నేరాల నియంత్రణకు ఇవే కీలకమంటూ ఉన్నతాధికారులు సూచన
- కొత్త కెమెరాలు ఏర్పాటుపై సిబ్బంది కసరత్తు

**తెనాలిరూరల్:** నేర నియంత్రణకు ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కళ్లు మూత పడ్డాయి. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న తెనాలిలో నిఘానేత్రం వైఫల్యం ప్రజలను కలవరపెడుతోంది. ఇది అదనుగా చూసుకుని దుండగలు నేరాలు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. పట్టణంలో సమస్యల నివారణకు పోలీసు, పురపాలక సంఘం భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను 2012 అక్టోబర్‌లో ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులతో సహా కీలక ప్రాంతాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటయ్యాయి. పట్టణంలో 48 కీలక ప్రదేశాల్లో నిఘా కెమెరాలు ఆర్భాటంగా ఏర్పాటు చేయాలని భావించారు. తొలుత ట్రాఫిక్ పర్యవేక్షణ నిమిత్తమని భావించినా, ఈ వ్యవస్థను విస్తృతపరిచారు. కూడళ్లతో పోలిస్తే, ప్రధాన రహదారుల్లో హెచ్చు సామర్థ్యం కలిగిన కెమెరాలను బిగించారు. మనుషుల ముఖాలను, చివరకు కారు నంబర్లను సైతం గుర్తించేందుకు వీలయిన ఈ కెమెరాలతో నేరగాళ్లను గుర్తించి, నేరాలకు కళ్లెం వేయాలనేది ఉద్దేశం. మహిళల మెడలో బంగారు గొలుసులు అపహరించే చైన్ స్నాచర్స్, ఈవ్‌టీజింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు వీటిని వినియోగించుకోవాలన్న సంకల్పంతో ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీ మార్కెట్ కాంప్లెక్సులో నిఘా కెమెరాల కంట్రోలు రూం, అందులో అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, కంప్యూటర్లు ఏర్పాటుచేశారు.


గతంలో ఏర్పాటు చేసిన హైటెక్ కెమెరాలు



పోలీసులు ఏర్పాటు చేయిస్తున్న సీసీ కెమెరాలు

నేర పరిశోధనల్లో ఈ కెమెరాలు ఉపయోపడ్డాయి. అయితే తదనంతర కాలంలో వీటి నిర్వహణ అటు పురపాలక సంఘం కానీ, ఇటు పోలీసు శాఖ కానీ చేపట్టలేకపోయింది. ఫలితంగా కెమెరాలు నిరుపయోగమయ్యాయి.

అంతే కాక కెమెరాలే చోరీకి గురవడం గమనార్హం. ప్రజలకు వీటి ఆవశ్యకతను తెలియజేసి, వారి ఆర్థిక సహకారంతో కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణా అంతంత మాత్రమే.

#### 2018లో హైటెక్ కెమెరాల ఏర్పాటు..

2018లో పట్టణంలో హైటెక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పాత తెనాలి పోలీస్ సబ్ డివిజన్‌కు 107 కెమెరాలను కేటాయించారు. వీటిలో ఏఎన్‌పీఆర్ – 45, ఎఫ్ఆర్ఎస్ – ఐదు, పీఏ – 20, ఆర్ఎల్‌వీడీ, సాధారణ కెమెరాలు కలిపి 37 ఉన్నాయి. కేవలం ప్రధాన కూడళ్లనే కాకుండ, మారుమూల్లోని కూడళ్లలో సైతం కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు సచివాలయంతో పాటు డీజీపీ కార్యాలయానికి అనుసంధానం చేశారు. వీటిలోనే తెనాలి పీసీఆర్‌కు అనుసంధానించిన కొన్ని కెమెరాలు పని చేయడం లేదు. దీంతో ఏదైనా నేరం జరిగితే డీజీపీ కార్యాలయానికి ఫలా నంబరు కెమెరా ఫుటేజ్ కావాలంటూ పోలీసులు లేఖ రాయాల్సి వస్తోంది.

#### ఎస్పీ ఆదేశాలతో కొత్త కెమెరాలు

నేరనియంత్రణ, కేసుల దర్యాప్తునకు సీసీ కెమెరాల ఆవశ్యకత ఉందని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ భావిస్తున్న నేపథ్యంలో పోలీసు అధికారులు పట్టణంలో కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. త్రీ టౌన్ సర్కిల్ పరిధిలో రైల్వేస్టేషన్, చెంచుపేట వంటి ప్రధాన ప్రాంతాల్లో 16 కెమెరాలను ఏర్పాటు చేశారు. అన్ని కూడళ్లలో ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.

### ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



**తెనాలిఅర్బన్:** ఇళ్ల మధ్యలో ఉన్న పిచ్చిమొక్కలను స్థల యాజమానులు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 27,28, 32 వార్డులలో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు మొలచి స్థానికులకు ఇబ్బందికరంగా మారడంతో వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కల వలన దోమల వ్యాప్తి పెరగడంతో పాటు విషసర్పాల సంచారం ఎక్కువైనట్లు తెలిపారు.

తరచూ వీటిపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. స్థల యాజమానులు తమ స్థలాలను బాగు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ ఎస్‌వీ లక్ష్మీపతి, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పశుగణన గోడపత్రిక ఆవిష్కరణ

**తెనాలి:** 21వ అఖిలభారత పశు గణన ను తెనాలి డివిజన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ముందుగా అఖిల భారత పశుగణన గోడ పత్రికను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ ఆవిష్కరించారు. విషయ సేకరణదారు బొంతా నారాయణకు సంబంధిత కిట్‌ను సబ్‌కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిజిటల్ విధానంలో చేపడుతున్న 21వ అఖిలభారత పశుగణన సజావుగా పూర్తికాగలదన్న ఆశాభావాన్ని సబ్‌కలెక్టర్ వ్యక్తంచేశారు. పశుగణనలో ఈసారి ప్రత్యేకతలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పశుసంవర్ధకశాఖ, పెదరావూరు డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి మాట్లాడుతూ డివిజనులోని తెనాలి, దుగ్గిరాల, నిడుబ్రోలు, మంగళగిరి పశువైద్యశాలల పరిధిలోని 81 రెవెన్యూ గ్రామాల్లో పశుగణన చేపట్టినట్టు తెలిపారు. ఇందుకోసం ఆయా మండలాల్లో 95 మంది ఎన్యూమరేటర్లు, 24 మంది సూపర్‌వైజర్లకు ముందుగానే శిక్షణనిచ్చినట్టు చెప్పారు. 20వ అఖిల భారత పశుగణన ప్రకారం డివిజనులో ఆవులు 6,601, గేదెలు 96,170, గొర్రెలు 38,892, మేకలు 8,906, పౌల్ట్రీ కోళ్లు 4,88,961, ఇతరాలు 4,475 ఉన్నట్టుగా తెలియజేశారు. తాజా సర్వే 2025 ఫిబ్రవరి 28వ తేదీనాటికి పూర్తవుతుందని వివరించారు. కార్యక్రమంలో తెనాలి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ

## ఎరుకలపూడిలో ఉచిత పశువైద్యశిబిరం

60 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 27 పశువులకు నట్టల నివారణ మందు

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో శుక్రవారం తెనాలి రూరల్ మండల గ్రామం ఎరుకలపూడిలో ఉచిత గర్భకోశ వ్యాధుల పశువైద్యశిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం ప్రారంభించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.బాలశంకర్, పశుసంవర్ధకశాఖ, పెదరావూరు డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి వైద్య శిబిరంలో పశువుల్లో గర్భకోశ వ్యాధులపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వైద్యశిబిరంలో మొత్తం అరవై పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 27 పశువులకు నట్టల నివారణ మందును తాగించారు. 40 కిలోల ఖనిజ లవణ మిశ్రమాన్ని పశుపోషకులకు అందజేశారు. అన్ని పశువులకు పేడ, ఇతరపరీక్షలను పెదరావూరులోని నియోజకవర్గస్థాయి పశువుల వ్యాధి నిర్ధారణ కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ ఎం.రాజేష్, మోహన్‌సాయి నిర్వహించారు. పసుపులేటి మురళీకృష్ణ, చందు శాంతికుమారి, గ్రామపెద్దలు పాల్గొని సహాయ సహకారాలను అందజేశారు. సీనియర్ పశువైద్యుడు, సంచార పశు ఆరోగ్యసేవ డాక్టర్ కె.బసవపున్నయ్య, మంగళగిరి, తెనాలి అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ పాలపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ బి.నాగిరెడ్డి, కొలకలూరు పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ డి.మీనాక్షి, పారా వెటరనరీ సిబ్బంది ఎం.పేరయ్య, టి.అనూష, ఎ.రంగారావు, ఎం.సాయి, ఎన్‌సీహెచ్ సాయికుమార్, ఎండీ అబ్దుల్ ఖయ్యూం, కె.శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పశుపోషకులకు మిశ్రమం పంపిణీ చేస్తున్న దృశ్యం

## సూర్యలంక బీచ్ సందర్శకులపై ఫీజు భారం

**బాపట్ల:** సూర్యలంక అభివృద్ధికి బీచ్‌కు వచ్చే సందర్శకుల నుంచి ఫీజు వసూలు చేస్తామని బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ వెల్లడించారు. కార్తిక మాసం సందర్భంగా సముద్ర తీరానికి వచ్చే వారికి కల్పించాల్సిన వసతులపై మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్నానాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు, తీరం వద్ద ఫెన్సింగ్ నిర్మాణం, మూడు ప్రవేశ ద్వారాల ద్వారా అనుమతి తదితరాలపై చర్చించారు. వచ్చే జనవరి నుంచి ఒక్కో సందర్శకుడి నుంచి రూ.20 వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పుడు కొనసాగుతున్న టోల్ గేట్‌ను రద్దు చేసి, వాహనాల పార్కింగ్ చేసిన ప్రాంతానికి వెళ్లి పంచాయతీ సిబ్బంది పార్కింగ్ ఫీజు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సూర్యలంక తీరాన్ని విదేశీయులను సైతం ఆకర్షించేలా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్ రావు, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు

### 95 మందికి కంటి పరీక్షలు



**ఫిరంగిపురం:** మండలంలోని వేములూరిపాడు గ్రామంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్య సిబ్బంది శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 95 మందికి సిబ్బంది పరీక్షలు చేశారు. వారిలో 40మంది శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ రవికాంత్ తెలిపారు. వారిని సాయంత్రం వాహనంలో శంకర కంటి వైద్యశాలకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించి, అనంతరం గ్రామంలో వాహనంలో దింపుతామని చెప్పారు. కార్యక్రమాన్ని జెట్టి, సుబ్బారావు, అన్నవరపు శేషాయిలు పర్యవేక్షించారు, వైద్యశాల సిబ్బంది అనూహ్య, సుధీర పాల్గొన్నారు.

### ఆహార పొట్లాలు పంపిణీ



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి పట్టణ పరిధిలోని దేవస్థానం సెంటర్ వద్ద ఏపీ ఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాచకులకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు మాట్లాడుతూ తన కుమారుడు శివ జన్మదినం సందర్భంగా భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, భగీరథ ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ఏపీఎస్పీ రిటైర్డ్ పోలీసు ఆఫీసర్లు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారని అన్నారు. వీకే గోవర్ధనవవు, చిన్న తిరుపతి నాయుడు, గోవిందయ్య, సుబ్బారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్. శివశంకరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**కొల్లిపర:** వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ పి.కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో, దావులూరు అడ్డరోడ్డు వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి సమయంలో వాహనాలు అతి వేగంగా నపకుండా రోడ్డు పై ఏమైనా అటంకాలు, గుంతలు ఉన్నాయా అన్న అంశాలను పరిశీలించుకుంటూ బైకును నడపాలన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో ఎల్లవేళలా తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలన్నారు.

రాత్రి, పగలు ఎప్పుడూ మద్యం సేవించి వాహనం నడపడం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహన ఆర్‌సీ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తూములూరు(కొల్లిపర):** మండల పరిధిలోని చివలూరు గ్రామం శివారులో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి అర్ధరాత్రి చేటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తూములూరు గ్రామానికి చెందిన వింత మహేశ్వర రెడ్డి (45) అనే వ్యక్తి నందివెలుగులో దాల్ మిల్‌లో పనిచేస్తూ ఉంటాడు. ఇతను ఎప్పటి లాగానే దాల్‌మిల్‌లో విధులు ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. అయితే చివలూరు గ్రామ సమీపంలో రోడ్డు మరమ్మతుల కోసం నడిరోడ్డు పై తోలిన గ్రావెల్ గుట్టను గమనించలేకపోయాడు. ఆ గుట్టను మహేశ్వర రెడ్డి ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పశుగణన సర్వే ప్రారంభం

**వేమూరు:** పశువుల పెంపకదారులు పశు గణన సర్వే సిబ్బందికి పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన సర్వేను ప్రారంభించారు. సంబంధిత గోడ పత్రికలు, బ్రోచర్లు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం పశు సంవర్ధక శాఖ అధికారి జనార్దనరావు, పశు వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యం మెరుగు కీలకం

**కర్లపాలెం:** గ్రామంలో పారిశుద్ధ్య పనులకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆదేశించారు. కర్లపాలెం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని వారికి సూచించారు. రోజూ అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికే అందేలా పని చేయాలని చెప్పారు. సమస్యలతో సచివాలయానికి వచ్చే ప్రజలకు మంచిగా సమాధానం చెప్పటంతోపాటు వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి శుక్రవారం సీఎం సహాయ నిధి నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ మంగళగిరి పట్టణ పరిధిలోని 18వ వార్డుకు చెందిన ఉప్పల మల్లేశ్వరికి రూ.1.60 లక్షలు, ఉండవల్లి గ్రామానికి చెందిన జొన్నా హరితకు రూ.1.05 లక్షలు విలువ గల చెక్కులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రిజాయ్, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, కారంపూడి చిరంజీవి, దామర్ల రాంబాబు, అందె మురళి, గాదె వినయ్, శనకా బుజ్జి, కూనపురెడ్డి రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ మార్కెట్లతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

**తెనాలిఅర్బన్:** మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు అర్బన్ మార్కెట్‌లు దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు మున్సిపల్ మార్కెట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను వారు ప్రారంభించారు. స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన పిండి వంటలు, పచ్చళ్లు, జ్యూట్ బ్యాగ్‌లు, గాజులు, గోళ్ళ రంగులు, హెయిర్ రిబ్బన్స్, చీరలు, మొదలగు వంటి వాటిని మార్కెట్‌లో ఉంచి విక్రయించారు. అన్ని స్టాల్స్‌ను పరిశీలించి వాటి వివరాలను చైర్‌పర్సన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులకు మార్కెట్ వసతి కల్పించాలనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతి తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు లభిస్తాయని చెప్పారు. శనివారం కూడా అర్బన్ మార్కెట్ కొనసాగుతుందని తెలిపారు. మెప్మా సీఎంఎం విజయ మాట్లాడుతూ ప్రతి నెల రెండు రోజులు అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మేనేజర్ దేవసేన, పలువురు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


మార్కెట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

## హిందూ ధర్మంతోనే శాంతి స్థాపన

**నిజాంపట్నం:** హిందూ ధర్మంతోనే శాంతి స్థాపన సాధ్యమని జిల్లా మహిళా సమన్వయ బాల వికాస్ సభ్యుడు యల్లాప్రగడ సీతాపతి అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ నిజాంపట్నం సబ్ డివిజన్ గ్రామ కన్వీనర్‌లకు మండల కేంద్రమైన నిజాంపట్నంలోని కార్యాలయంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మం సనాతనమైనదని, భగవద్గీత ప్రపంచంలో అత్యుత్తమమైన గ్రంథమన్నారు. అలాంటి ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత గ్రామ కన్వీనర్‌లపై ఉందని పేర్కొన్నారు. ప్రతి నెల గ్రామ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్‌లకు కూడా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ కాశేపల్లి గౌరీశంకర్, మహిళా కన్వీనర్ సుగుణార్థిని, సబ్ డివిజన్ కన్వీనర్‌లు మోపిదేవి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ చంద్రబాబు, అక్కల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీతాపతి

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం కావాలి

**నగరం:** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాలలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు.




తొలుత శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో బి.శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.